www.prajasakti.com
ప్రజాశక్తి
ఆదివారం 26 జనవరి 2025
5
ఏలూరు




మానవ అక్రమ రవాణా అరికట్టేందుకు కృషి

న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి రత్నప్రసాద్

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

మానవ అక్రమ రవాణా అరికట్టడానికి ప్రతిఒక్కరూ సమిష్టిగా కృషి చేయాలని ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి కె.రత్నప్రసాద్ సూచించారు. జిల్లా న్యాయ సేవాధికార సంస్థ భవనంలో ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా యాంటీ హ్యూమన్ ట్రాఫికింగ్ యూనిట్ అధికారులతో శనివారం ఆయన అవగాహనా సదస్సును నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గుర్తించిన బాధితులను చిల్డ్రన్ హోమ్స్‌లలో కాని పునరావాస కేంద్రాల్లో వసతి కల్పించి వారికి ఆహారం, వైద్య, విద్య, ఉపాధి కల్పన సౌకర్యాలు కల్పిస్తారని తెలిపారు. అలాగే వారికి అవసరమైన న్యాయ సహాయాన్ని న్యాయ సేవాధికార సంస్థలు ఉచితంగా అందిస్తాయన్నారు. ఇటువంటి సమస్య ఎదురైన వారు గోప్యతను పాటించకుండా దగ్గరలోని పోలీస్‌స్టేషన్లో గాని న్యాయ సేవాధికార సంస్థను కాని సంప్రదించవచ్చని

కౌలు రైతు రుణ ఘోష..!



> రెండు జిల్లాల వ్యవసాయ సాగులో కౌలు రైతులదే ప్రధాన భూమిక
>
> పంట రుణాల మంజూరులో మాత్రం అధమం
>
> పశ్చిమలో రూ.250 కోట్లు, ఏలూరు జిల్లాలో రూ.170 కోట్లు రుణాలుగా మంజూరు
>
> సాంకేతిక సమస్యలను పరిష్కరిస్తేనే రైతుకు మేలు

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

కౌలు రైతులకు బ్యాంకు రుణాలు అందని ద్రాక్షగానే మిగులుతున్నాయి. గత ప్రభుత్వం కంటే ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో పంట రుణాల మంజూరు పెరిగినట్లు చెబుతున్నా.. అది కంటితుడుపు చర్యగానే ఉందని చెప్పొచ్చు. సాగు చేస్తున్న కౌలురైతులకు రుణాలిచ్చేందుకు సాంకేతిక సమస్యలు అడ్డుపడుతున్నట్లు బ్యాంకర్లు చెబుతున్నారు. సమస్యలను పరిష్కరించి కౌలురైతులకు రుణాలు పూర్తిస్థాయిలో అందినప్పుడే వ్యవసాయం ముందుకు సాగే పరిస్థితి ఉంటుంది. ఏలూరు, పశ్చిమగోదావరి జిల్లాల్లో దాదాపు మూడు లక్షల మంది కౌలురైతులు ఉన్నట్లు లెక్కలు చెబుతున్నాయి. 2014-19 నడుమ టిడిపి ప్రభుత్వ హయాంలో కౌలురైతులకు జారీ చేసిన కౌలుకార్డుల లెక్కలు దీనికి ప్రత్యక్ష నిదర్శనమని చెప్పొచ్చు. వైసిపి ప్రభుత్వంలో కౌలురైతుల సంఖ్యను తక్కువగా చూపించారనే విమర్శలు విన్పిస్తున్నాయి. 2024-25 ఆర్థిక సంవత్సరంలో పశ్చిమగోదావరి జిల్లాలో 87 వేల మందికి, ఏలూరు జిల్లాలో 65 వేల మందికి కౌలుకార్డులు ఇచ్చిన పరిస్థితి ఉంది. ఇప్పటి వరకూ పశ్చిమలో 46 వేల మంది కౌలురైతులకు రూ.250 కోట్లు, ఏలూరు జిల్లాలో దాదాపు 22 వేల మందికి రూ.170 కోట్లు పంట రుణాలు మంజూరు చేసినట్లు లెక్కలు చెబుతున్నాయి. ఈ ఆర్థిక సంవత్సరంలో రెండు జిల్లాల్లో కలిపి రూ.650 కోట్లు రుణాలివ్వాలని టార్గెట్ పెట్టుకోగా, ఇప్పటి వరకూ రూ.420 కోట్లు రుణాలిచ్చినట్లు లెక్కలు చూపిస్తున్నాయి. రబీ సాగు మరో రెండు నెలల్లో పూర్తికానుంది. పంట రుణాలు ఇంకా ఎప్పుడు అందిస్తారో తెలియని అయోమయ పరిస్థితి నెలకొంది. 2014-19 మధ్యకాలంలో ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలో కౌలురైతులకు రూ.వెయ్యి కోట్లు వరకూ రుణాలు మంజూరు చేసిన పరిస్థితి ఉంది. ఇప్పుడు మాత్రం తక్కువగా రుణాల టార్గెట్ తీసుకోవడం ఏమిటో అర్థం కాకుండా ఉంది. ప్రస్తుతం కౌలురైతులకు మంజూరు చేసిన రుణాలు జిల్లా వ్యవసాయ రుణ ప్రణాళికలో పంట రుణాలకు కేటాయించిన బడ్జెట్‌లో ఒక్క శాతం కూడా లేదంటే ఆశ్చర్యపోక తప్పదు. కౌలురైతులకు పంట రుణాలు ఇచ్చేందుకు బ్యాంకులు వెనుకాడుతున్నాయి. దీనిపై బ్యాంకులు వివిధ సాంకేతిక కారణాలు చెబుతూ వస్తున్నాయి. సాంకేతిక సమస్యలను పరిష్కరించి కౌలురైతులకు రుణాలు అందేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవడంలో విఫలమవుతున్న పరిస్థితి ఉంది.

సాగు చేయని భూయజమానికి పంట రుణమా?

కౌలురైతులకు ఇస్తున్న కౌలుకార్డులపై పేర్కొంటున్న సర్వే నెంబర్లపై భూయజమానులు పంటరుణాలు ముందుగానే తీసుకుంటున్నారు. దీంతో అదే సర్వే నెంబర్‌పై కౌలురైతులకు రుణాలు ఇవ్వడం టెక్నికల్‌గా సాధ్యం కావడం లేదని బ్యాంకర్లు చెబుతున్నారు. పంట రుణం అనేది సాగుచేసే రైతుకు ఇవ్వాలి. అలాకాకుండా సాగు చేయకుండా పట్టణాల్లో నివసించే భూయజమానులకు ఏవిధంగా బ్యాంకులు పంటరుణం ఇస్తున్నాయో అర్థం కావడం లేదు. భూయజమానులకు ఇచ్చే రుణం పంటేతర రుణంగా మార్పు చేసి, కౌలురైతులకు పంట రుణాలివ్వాలి. ప్రభుత్వం ఆ దిశగా ఆలోచించకుండా మాటలతో కాలక్షేపం చేస్తోంది. కౌలుచట్టంలో మార్పులు చేస్తామని కూటమి ప్రభుత్వం చెప్పినా ఇప్పటికీ జరగలేదు. ప్రస్తుత పరిస్థితుల్లో వరిసాగులో ఎకరాకు రూ.40 వేల వరకూ పెట్టుబడి అవుతోంది. నాలుగెకరాలు సాగు చేయాలంటే దాదాపు రూ.రెండు లక్షల పెట్టుబడి అవసరం. బ్యాంకులు రుణాలివ్వకపోవడంతో కౌలురైతులు ప్రయివేటు వడ్డీ వ్యాపారులను ఆశ్రయించాల్సి వస్తోంది. దీంతో అధిక వడ్డీల భారం పెరిగి రైతులు తీవ్ర నష్టాలను చవిచూస్తున్నారు. ఏదైనా విపత్తులు సంభవించి పంట దెబ్బతింటే వడ్డీ వ్యాపారుల ఒత్తిడి తట్టుకోలేక కౌలురైతులు ఆత్మహత్యలకు పాల్పడుతున్న పరిస్థితి ఉంటోంది. కౌలురైతుల రుణ ఘోష రోజురోజుకు మిన్నంటుతున్నా పాలకులకు మాత్రం పట్టడం లేదు. గ్రామాల్లో అవగాహనా సదస్సులు ఏర్పాటు చేసి కౌలురైతులకు పంట రుణాలిచ్చే విధంగా ప్రభుత్వం చర్యలు తీసుకోవాల్సి ఉంది. అంతేకాకుండా గతంలో టిడిపి రుణమాఫీ కౌలురైతులకు వర్తింపజేయకపోవడంతో చాలామంది రైతులు తీవ్ర ఇబ్బందులు పడిన పరిస్థితి ఉంది. ఇప్పటికైనా ప్రభుత్వం కౌలురైతుల సమస్యను పరిష్కరించి రుణాలు అందేలా చర్యలు తీసుకోవాలి.



విద్యుద్దీపాల వెలుగుల్లో కలెక్టరేట్ భవనం

నేడు రిపబ్లిక్‌డే వేడుకలకు ఏర్పాట్లు పూర్తి

ప్రజాశక్తి - ఏలూరు స్పోర్ట్స్

76వ గణతంత్ర దినోత్సవం సందర్భంగా ఈ నెల 26వ తేదీ ఆదివారం ఉదయం 9 గంటలకు ఏలూరు పోలీస్ పెరేడ్ మైదానంలో జిల్లా కలెక్టర్ కె.వెట్రిసెల్వి జాతీయ పతాకావిష్కరణ చేస్తారు. అనంతరం ఉదయం 9.05 గంటలకు పోలీస్ గౌరవ వందన స్వీకరణ, 9.15 గంటలకు జిల్లా ప్రగతిపై కలెక్టర్ సందేశం, అనంతరం పోలీసు కవాతు, 9.45 గంటలకు విద్యార్థులచే సాంస్కృతిక కార్యక్రమాలు, ప్రగతి శకటాల ప్రదర్శన, 11 గంటలకు ప్రశంసాపత్రాల బహూకరణ, 11.30 గంటలకు వివిధ ప్రభుత్వ శాఖల స్టాల్స్ సందర్శన, లబ్ధిదారులకు ఉపకరణాలు, రుణాల పంపిణీ చేపడతారు. అనంతరం వందన సమర్పణ చేస్తారు.

అర్హులంతా ఓటరుగా నమోదు కావాలి

కలెక్టర్ కె.వెట్రిసెల్వి



ప్రజాశక్తి - ఏలూరు

ఓటు ప్రాధాన్యత గురించి ప్రతిఒక్కరికీ తెలియజేయాల్సిన అవసరం ఉందని, 18 సం.లు నిండిన ప్రతి ఒక్కర ఓటరుగా నమోదు చేసుకోవాలని జిల్లా కలెక్టర్ కె.వెట్రిసెల్వి అన్నారు. శనివారం స్థానిక కలెక్టరేట్‌లోని గోదావరి సమావేశ మందిరంలో 'జాతీయ ఓటర్ల దినోత్సవాన్ని' పురస్కరించుకుని జిల్లా అధికారులు, విద్యార్థులు, కలెక్టరేట్ సిబ్బందితో ఓటరు ప్రతిజ్ఞ నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ వెట్రిసెల్వి మాట్లాడుతూ 18 సంవత్సరాలు పూర్తయిన ప్రతిఒక్కరూ ఓటరుగా నమోదు చేసుకోవాలని, ఎన్నికల్లో తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని ఆమె కోరారు. ప్రజాస్వామ్య దేశంలో ఓటుహక్కు ఎంతో విలువైందని, ఓటు హక్కుకు ఉన్న విలువను ఓటర్లు తెలుసుకోవాలని సూచించారు. ఓటు హక్కు ద్వారా సమర్థవంతమైన పాలనను ఏర్పాటు చేసుకోవచ్చని ఆమె తెలిపారు. జిల్లాలో ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల పరిధిలో 16,37,555 ఓటర్లుగా నమోదై ఉన్నారన్నారు. వీరిలో 7,99,283 మంది పురుషులు, 8,38,146 మంది మహిళలు, 126 మంది థర్డ్ జండర్ ఉన్నారన్నారు. 2024 తుది ఓటర్ల జాబితా నాటి నుంచి 2025 తుది ఓటర్ల జాబితా సవరణ నాటికి 18-19 వయస్సు గల యువ ఓటర్లు 24,735 మంది ఓటర్లుగా నమోదు చేసుకున్నారని, వికలాగులైన ఓటర్లు 19,970 మంది, ఎలక్ట్రోల్స్ నమోదు చేయబడిన స్త్రీలు 1049 మంది, వెయ్యి మంది పురుషులు జిల్లాలో కలిగి ఉన్నారన్నారు. కార్యక్రమానికి ముందు విద్యార్థినులతో ఓటు ప్రాముఖ్యతపై సాంస్కృతిక కార్యక్రమం నిర్వహించారు. అనంతరం సీనియర్ సిటిజన్ ఓటర్లయిన దేవరపల్లి కుటుంబరావు, బి.దమయంతి, ఇందుకూరు వెంకటలక్ష్మీపతిరాజులను కలెక్టర్ సన్మానించారు. కొత్తగా ఓటర్లుగా నమోదైన యువతకు ఓటరు ఐడి కార్డులను, ఓటరు దినోత్సవం సందర్భంగా కళాశాలల్లో, పాఠశాలల్లో నిర్వహించిన వ్యాసరచన, వక్తృత్వ, రంగవల్లుల పోటీల్లో గెలుపొందిన వారికి ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులను, సర్టిఫికెట్లను కలెక్టర్ అందజేశారు. తొలుత గోదావరి సమావేశ మందిరం వద్ద ఏర్పాటు చేసిన ఓటరు నమోదు, నమూనా మోడరన్ పోలింగ్ కేంద్రాన్ని కలెక్టర్ పరిశీలించారు. కార్యక్రమంలో డిఆర్ఒ వి.విశ్వేశ్వరరావు, ఆర్‌డిఒ అచ్యుత అంబరీష్, జెడ్‌పి సిఇఒ కె.సుబ్బారావు, డిఆర్‌డిఎ పీడీ ఆర్.విజయరాజు, సెట్‌వెల్ సిఇఒ కె.ప్రభాకరరావు, తహశీల్దార్ శేషగిరి, కలెక్టరేట్ ఎఒ నాంచారయ్య, వివిధ శాఖల అధికారులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఈ-శ్రమ్ పోర్టల్‌పై అవగాహన కల్పించాలి

జిల్లాలో అసంఘటిత రంగాల్లో పని చేస్తున్న కార్మికులను ప్రతి ఒక్కరినీ 'ఈ-శ్రమ్' పోర్టల్‌లో మార్చి 31వ తేదీలోగా నమోదు చేయాలని కలెక్టర్ కె.వెట్రిసెల్వి సంబంధిత అధికారులను ఆదేశించారు. స్థానిక కలెక్టరేట్లోని గౌతమి సమావేశపు హాలులో శనివారం అసంఘటిత కార్మికులను 'ఈ-శ్రమ్' పోర్టల్‌లో నమోదుపై అధికారులతో ఆమె సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ వెట్రిసెల్వి మాట్లాడుతూ జిల్లాలో ఐదు లక్షల మందికిపై కార్మికులు అసంఘటిత రంగంలో పని చేస్తున్నారని, వారికి సామాజిక భద్రతతోపాటు వివిధ సంక్షేమ పథకాలను అందించేందుకు వారందరినీ 'ఈ-శ్రమ్' పోర్టల్‌లో నమోదు చేయాల్సి ఉందని అన్నారు. ఈ పథకంలో చేరేందుకు 16 నుండి 59 సంవత్సరాల్లోపు వయస్సు ఉండాలని, ఆదాయపు పన్ను చెల్లించనివారు, ఇపిఎఫ్, ఇఎస్ఐ సౌకర్యం లేనివారు అర్హులన్నారు. 'ఈ-శ్రమ్' పోర్టల్‌లో నమోదైన ప్రతి కార్మికుడికీ ఒక సంవత్సరంపాటు ప్రధాన మంత్రి సురక్ష బీమా యోజన కింద రూ.2 లక్షలు వరకు ప్రమాద బీమా సౌకర్యం ఉచితంగా కల్పిస్తారన్నారు. సమావేశంలో కార్మిక శాఖ డిప్యూటీ కమిషనర్ పి.శ్రీనివాస్, జెడ్‌పి సిఇఒ కె.సుబ్బారావు, డిఆర్‌డిఎ పీడీ ఆర్.విజయరాజు, కార్మిక శాఖ అసిస్టెంట్ కమిషనర్ జి.నాగేశ్వరరావు, డ్వామా పీడీ సుబ్బారావు, డిపిఒ కె.అనురాధ, వ్యవసాయశాఖాధికారి హబీబ్‌భాషా, ఐసిడిఎస్ పీడీ శారద, హౌసింగ్ పీడీ సత్యనారాయణ, డిఇఒ వెంకటలక్ష్మమ్మ, బిసి కార్పొరేషన్ ఇడి ఎన్.పుష్పలత, కార్మిక సంఘాల ప్రతినిధులు డిఎన్‌విడి.ప్రసాద్, డాంగే తదితరులు పాల్గొన్నారు.

కోలాహలంగా ఐదో పిల్లల సంబరాలు



విద్యార్థినుల నృత్య ప్రదర్శన

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

హేలాపురి బాలోత్సవం ఐదో పిల్లల సంబరాలు రెండో రోజు శనివారం కోలాహలంగా సాగాయి. ఒకపక్క వివిధ అంశాల్లో తమ ప్రతిభను ప్రదర్శించడానికి వచ్చిన విద్యార్థులు, మరోపక్క వారి తల్లిదండ్రులు, బంధువులు, ఉపాధ్యాయులతో సిద్ధార్థ క్వెస్ట్ పాఠశాల ప్రాంగణం తిరుణాళ్లను తలపించింది. ఆటలు, పాటలు, సరదాలు, సెల్ఫీలు, రకరకాల వేషధారణలు, వాయిద్య పరికరాలు, పలకరింపులు, కేకలు, కేరింతలతో బాలోత్సవం బాలలకు నిజంగా ఒక మహోత్సవమే అన్నట్లుగా సాగింది. రెండో రోజు అకడమిక్ అంశాల్లో మెమరీ టెస్ట్, కథ చెప్పడం, మైక్రోఆర్ట్స్, పేపర్ క్రాఫ్ట్, క్విజ్, ఇంగ్లీష్ రైమ్స్, పద్యాలు, మట్టితో బొమ్మలు వంటి అంశాల్లో విద్యార్థులు అద్భుతంగా పోటీ పడి తమ ప్రతిభ కనబరిచారు. చిట్టి చేతులతో చిన్నారులు మట్టి బొమ్మలు చేయడం చూపరులను విశేషంగా ఆకట్టుకుంది. ఇక కల్చరల్ అంశాల్లో సందేశాత్మక గీతాల బృంద నృత్యం, హరిశ్చంద్ర, గబ్బిలం పద్యాలాపన, సోలో క్లాసికల్ డ్యాన్స్, సందేశాత్మక గీతాలాపన, లఘు నాటిక, బుర్రకథ, హరికథ, జముకుల కథ, కోలాటం బృందం వంటి అంశాల్లో విద్యార్థులు అద్భుతమైన ప్రతిభను కనబరిచారు. తెలుగుదనం ఉట్టిపడేలా లంగాఓణీలు ధరించిన బాలికల కోలాట నృత్యం చూపరులను కట్టిపడేసింది. విచిత్ర వేషధారణ పోటీలో సోషల్ మీడియా వల్ల కలిగే అనర్థాలు, ప్లాస్టిక్ వినియోగం వల్ల కలిగే అనర్థాలు, మన భూమిని రక్షించుకుందాం, రక్తదానం చేద్దాం అనే సందేశాలతో కూడిన వేషాలతో పోటీ పడటం అద్భుతంగా అన్పించింది. ఏకపాత్రాభినయం పోటీలో దుర్యోధనుడు, ఝాన్సీలక్ష్మీబాయి, సావిత్రిబాయి పూలే, రాణి రుద్రమదేవి, సోది అమ్మాయి, అల్లూరి సీతారామరాజు, పిట్టలదొర, హరిదాసు, కోయదొర వంటి వేషాలతో విద్యార్థులు అద్భుతమైన ప్రతిభ కనబరిచారు. ఇక బృంద నృత్యాల్లో విద్యార్థులు కనబరిచిన ప్రతిభ ఎంత చెప్పినా తక్కువేనని చెప్పాలి. మొత్తం మీద మొదటి రోజు శుక్రవారం సుమారు ఐదు వేల మంది రాగా, రెండవ రోజు కూడా సుమారు ఐదు వేల మంది వరకు వివిధ పోటీల్లో పాల్గొన్నారు. రెండో రోజు సాయంత్రం పోటీలు ముగిశాయి. ఈ నెల 26వ తేదీ ఆదివారం సిఆర్‌రెడ్డి డిగ్రీ కళాశాల ఆడిటోరియం లో బహుమతి ప్రదానోత్సవం జరగనుంది. మొత్తం మీద ఏలూరు అర్బన్, రూరల్, దెందులూరు, పెదపాడు, పెదవేగి, భీమడోలు, ముసునూరు మండలాలతో పాటు సమీప మండలాల్లోని 165 పాఠశాలల నుంచి సుమారు తొమ్మిది వేల మంది వరకు విద్యార్థులు 69 అంశాల్లో పోటీపడి తమ ప్రతిభను కనబరిచారు. పది వేదికలపై కల్చరల్ పోటీలు, 20 తరగతి గదుల్లో అకడమిక్ పోటీలు నిర్వహించారు. ఈ పోటీలకు సుమారు 300 మంది న్యాయ నిర్ణేతలు, వాలంటీర్లు తమ సహకారం అందించారు. ఎక్కడికక్కడ ఎలాంటి ఆటంకమూ లేకుండా పోటీలు సజావుగా సాగేలా ఎన్‌సిసి విద్యార్థులు కూడా కష్టపడి పని చేశారు. బాలోత్సవం ఆహ్వాన సంఘం ఛైర్‌పర్సన్ అడుసుమిల్లి నిర్మల, వర్కింగ్ ప్రెసిడెంట్ విజిఎంఆర్.కృష్ణారావు, అధ్యక్షులు ఆలపాటి నాగేశ్వరరావు, నిర్వాహక కమిటీ కార్యదర్శి గుడిపాటి నరసింహారావుతోపాటు ఆహ్వాన కార్యనిర్వాహక కమిటీ సభ్యులు ప్రతిక్షణం అప్రమత్తంగా ఉంటూ ప్రతి కార్యక్రమాన్నీ పర్యవేక్షిస్తూ ఎలాంటి లోటూ లేకుండా రెండో రోజు పోటీలను సమర్థవంతంగా నిర్వహించారు. బాలోత్సవం పిల్లల సంబరాల్లో ఉదయం అల్పాహారం, మధ్యాహ్న భోజనం ఎలాంటి లోటూ లేకుండా వేల మందికి అందించడం ప్రశంసనీయం. ఈ విషయంలో నిర్వాహకులు అద్భుతంగా పనిచేశారు. మధ్యాహ్న భోజనం పూర్ణం బూరె, మసాలా వడ, వెజ్ బిర్యానీ, సాంబారు అన్నం, పెరుగు అన్నం, పచ్చడి తో అద్భుతంగా ఉందని, ఎలాంటి లోటు లేకుండా నిర్వాహకులు భోజన ఏర్పాట్లు చేయటం అభినందనీయమని పలువురు తల్లిదండ్రులు ప్రశంసించారు.



సోషల్‌మీడియాలో కాదు.. కుటుంబంతో గడపాలని చిన్నారి ప్రదర్శన



ప్లాస్టిక్ వాడొద్దంటూ చిన్నారి ప్రదర్శన



భూమిని పరిరక్షించాలని చిన్నారి ప్రదర్శన

అగ్ని ప్రమాద బాధితులను ఆదుకుంటాం

క్షతగాత్రులకు పూర్తిస్థాయిలో వైద్యం : ఎంపీ పుట్టా మహేష్‌కుమార్



సాయం అందిస్తున్న ఎంపీ, ఎంఎల్ఎ

ప్రజాశక్తి - మండవల్లి

అగ్ని ప్రమాద బాధితులను అన్నివిధాలా ఆదుకోవడంతోపాటు గాయాల పాలైన వారికి పూర్తి స్థాయిలో వైద్యం అందించేలా అన్ని చర్యలూ చేపట్టామని ఏలూరు ఎంపీ పుట్టా మహేష్‌కుమార్ స్పష్టం చేశారు. మండలంలోని ప్రత్తిపాడు స్టేజీ వద్ద శుక్రవారం రాత్రి చోటుచేసుకున్న అగ్నిప్రమాదం ప్రాంతాన్ని ఆయన పరిశీలించారు. బాధితులను పరామర్శించారు. ఈ సందర్భంగా బాధితులు మాట్లాడుతూ అగ్నిప్రమాదం సంభవించి పది ఇళ్లు పూర్తిగా అగ్నికి ఆహుతి కావడంతో కట్టుబట్టలతో మిగిలామని వాపోయారు. క్షణాల్లో పెద్దఎత్తున మంటలు వ్యాపించాయని, ఆ మంటల్లో నలుగురు వ్యక్తులతోపాటు మహిళ, చిన బాబు గాయాల పాలయ్యారని వివరించారు. బాధితులకు త్వరితగతిన కోలుకునేలా పూర్తిస్థాయిలో వైద్య సేవలందించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. దీనిపై స్పందించిన ఎంపీ అక్కడ నుంచే వైద్యశాఖాధికారులతో ఫోన్లో మాట్లాడారు. బాధితులకు పూర్తిస్థాయిలో వైద్యం అందించాలన్నారు. బాధితులు కట్టుబట్టలతో మిగిలిపోవడం బాధాకరమన్నారు. ప్రభుత్వం నుండి సహాయాన్ని వెంటనే అందించేలా చర్యలు తీసుకుంటామని ఆయన తెలిపారు. ఎంపీ రూ.50 వేలు, కైకలూరు ఎంఎల్ఎ కామినేని శ్రీనివాస్ రూ.50 వేలు, చాపరాల దుర్గాప్రసాద్ రూ.50 వేలు, చాపరాల బలరాం మనమరాలు లాస్య రూ.16 వేలు ఆర్థిక సహాయాన్ని బాధితులకు అందించారు. సత్యసాయి సేవా సమితి ఆధ్వర్యంలో నిత్యావసర సరుకులతోపాటు స్టీలు డబ్బాలను బాధితులకు అందించారు. రెవెన్యూ శాఖ ఆధ్వర్యంలో బియ్యం, పప్పు, ఆయిల్, పంచదార తదితర నిత్యావసర సరుకులను అందించారు. ఈ కార్యక్రమంలో డిఎస్‌పి శ్రావణ్ కుమార్, సిఐ రవికుమార్, ఎస్ఐ రామచంద్రరావు, తహశీల్దార్ గోపాల్, ఆర్ఐ శ్రావణి, సబ్జా బాబి, కొల్లు బాబి, సత్యసాయి సేవా సమితి బృందం సభ్యులు పాల్గొన్నారు

కటాఫ్ తేదీతో సంబంధం లేకుండా ప్యాకేజీ ఇవ్వాలి

ప్రజాశక్తి - కుక్కునూరు

18 సంవత్సరాలు నిండిన యువతీ యువకులకు కటాఫ్ తేదీతో సంబంధం లేకుండా పునరావాస పరిహారం చెల్లించాలని జిల్లా కార్యదర్శి ఎ.రవి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శనివారం స్థానిక ప్రజాసంఘాల కార్యాలయంలో సిపిఎం మండల కమిటీ సమావేశం మేడిపల్లి బాబు అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా రవి మాట్లాడుతూ పోలవరం ప్రాజెక్టు నిర్మాణం కోసం సర్వం త్యాగం చేస్తున్న నిర్వాసితులను ప్రభుత్వం చిన్నచూపు చూస్తోందని విమర్శించారు. 2013 భూసేకరణ చట్టం ప్రకారం నిర్వాసితులకు పరిహారం ఇవ్వకుండా ప్రభుత్వం నిర్వాసితులను మోసగిస్తోందన్నారు. జనవరి 3న నిర్వాసితుల ఖాతాలో జమ చేసిన పరిహారం 10 సంవత్సరాలు క్రితం నాటిది, ఇదే పద్ధతిలో ప్రాజెక్టు నిర్మాణం చేస్తున్న కంపెనీలకు నాటి బిల్లులే చెల్లిస్తున్నారా అని ప్రశ్నించారు. మొదటి కాంటూర్‌లో 8 గ్రామాలకు పరిహారం ఇచ్చిన, ప్రభుత్వం మిగిలిన గ్రామాలకు ఎందుకు ఇవ్వడం లేదని ప్రశ్నించారు. కాంటూర్ లెక్కలతో సంబంధం లేకుండా మండలం మొత్తాన్ని యూనిట్‌గా తీసుకుని పరిహారం చెల్లించాలని ఆయన డిమాండ్ చేశారు. నెల్లూరులో ఫిబ్రవరి 1, 2, 3 తేదీల్లో జరగనున్న

సిపిఎం రాష్ట్ర మహాసభ జాతా 30న జిల్లాకు రాక

ఆ పార్టీ జిల్లా కార్యదర్శి ఎ.రవి

సిపిఎం రాష్ట్ర మహాసభ జయప్రదం కోరుతూ కూనవరం నుంచి బయల్దేరే ప్రచార జాతా ఈ నెల 30న కుక్కునూరు వస్తుందని, ఈ జాతాను ప్రజలు జయప్రదం చేయాలని రవి పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో సిపిఎం మండల కార్యదర్శి బయ్యన శ్రీను, నాయకులు యర్రంశెట్టి నాగేంద్రరావు, పట్ల లక్ష్మయ్య, పట్ల సీతమ్మ, శ్యామల లక్ష్మణరావు, వర్స వీరాస్వామి, పి.రమేష్ తదితరులు పాల్గొన్నారు.

ప్యాకేజీ లేదు.. పునరావాసం లేదు..!



పోలవరం, కొల్లేరు ఇలా చెప్పుకుంటూ పోతే ఏదైనా కార్యక్రమం రీత్యా గూడు, కూడు కోల్పోతున్న నిర్వాసితులకు ప్యాకేజీ, పునరావాసం అందని ద్రాక్షగానే మిగులుతోంది. పోలవరం నిర్వాసితులకు ఇటీవల కొంతమందికి ప్యాకేజీ సొమ్ము అందినా అందాల్సిన వారు చాలా మంది ఉన్నారు. పూర్వ లెక్కల ప్రకారం ఇవ్వడం, ఏడున్నరేళ్ల తర్వాత ఇవ్వడంతో అర్హుల సంఖ్య పెరిగినా వారికెవ్వరికీ ప్యాకేజీ అందని ద్రాక్షగానే మిగిలింది. ఇక పరిహారం, పునరావాసం గురించి ఎంత చెప్పినా తక్కువే. నిర్వాసితుల కోసం నిర్మిస్తున్న పునరావాస కాలనీల్లో ఇళ్ల నిర్మాణం, సౌకర్యాల కల్పన నత్తనడకన సాగుతున్నాయి. ఇక నిర్మాణం పూర్తయ్యి నిర్వాసితులు నివాసముంటున్న కాలనీల్లో తాగునీరు, డ్రెయినేజీ వంటి సమస్యలతోపాటు శ్మశానం, ఉపాధి లేమి సమస్యలు నిర్వాసితులను తీవ్రంగా వెంటాడుతున్నాయి. ఇక ముంపు సమస్య ఏటా వేధిస్తూనే ఉంది. ముంపులో లేని గ్రామాలు సైతం కొద్దిపాటి వరదలకే నిండా మునుగుతున్నాయి. వీటన్నింటినీ పట్టించుకునే నాథుడే కరువయ్యాడు. ఇటీవల డిఆర్‌సిలో నిర్వాసితుల సమస్యలు చర్చకు రాగా వాటి పరిష్కారానికి త్వరలో ముంపు మండలాల్లో గ్రామసభలు నిర్వహిస్తామని ఇన్‌ఛార్జి మంత్రి నాదెండ్ల మనోహర్ ప్రకటించారు. జిల్లా యంత్రాంగం, ప్రభుత్వం ఆ దిశగా చర్యలు చేపట్టి నిర్వాసితుల సమస్యలు గుర్తించి పరిష్కరించేలా గ్రామసభలు నిర్వహించాలని బాధిత ప్రజలు కోరుతున్నారు. ఇప్పటి నుంచే దీనిపై కార్యాచరణ చేపడితే కనీసం వచ్చే జులైలో వరదల బారిన పడకుండా ఉంటామని వారు వాపోతున్నారు. మరి పాలకులు, అధికార యంత్రాంగం ఎలా ముందుకెళ్తుందో వేచిచూడాలి.

తాజాగా కొల్లేరు అంశం మళ్లీ తెరపైకొచ్చింది. కొల్లేరు ఆపరేషన్ పేరుతో 2006లో చెరువులను ధ్వంసం చేసిన సమయంలో ప్రభుత్వం ఇచ్చిన హామీలేవీ నేటికీ అమలు కాలేదు. ఎకో సెన్సిటివ్ జోన్ పేరుతో కొల్లేరు పరిధిలో మానవ మనుగడే ప్రశ్నార్థకంగా మారింది. పర్యావరణ పరిరక్షణ, పక్షులకు రక్షణకు ఎవరూ అభ్యంతరం చెప్పరు. అయితే పర్యావరణానికి విఘాతం కల్గించే అంశాలపై దృష్టి సారించకుండా తీసుకుంటున్న చర్యలు కొల్లేరువాసులను అక్కడి నుంచి తరిమేసేలా ఉన్నాయనే విమర్శలు వినిపిస్తున్నాయి. కనీసం గతంలో ఇచ్చిన ప్యాకేజీ సంగతి ఎలాగున్నా పర్యాటక రంగం అభివృద్ధితో ఉపాధి చూపుతామని ఇచ్చిన హామీ అమలుకు నోచుకోలేదు. దీంతో కొల్లేరువాసులు ఇతర ప్రాంతాలకు వలసలు వెళ్లే దుస్థితి దాపురించింది. బడాబాబులు మాత్రం చెరువుల సాగు యథాతథంగానే సాగుతోంది. ఇప్పటికైనా ప్రభుత్వం కొల్లేరు పరిధిని ఐదో కాంటూరు నుంచి మూడో కాంటూరుకు కుదించడంతోపాటు పర్యావరణానికి హాని కలిగిస్తున్న కాలుష్యం నివారణకు చర్యలు చేపట్టాలని అక్కడి ప్రజలు కోరుతున్నారు. అదే సమయంలో కొల్లేరు జిరాయితీ భూములు పేదలకు అప్పగించి సంప్రదాయ సాగుకు అనుమతివ్వాలని కోరుతున్నారు. అయితే హామీలివ్వడంలో ముందుండే పాలకులు, అధికారులు ఆచరణలో కనీసం వాటి ఊసెత్తకపోవడం అందరినీ బాధిస్తోంది.

-వివిఎస్‌వి.ప్రసాద్

పోలీస్‌స్టేషన్ నిర్మాణానికి స్థల పరిశీలన

ప్రజాశక్తి - మండవల్లి

నూతన పోలీస్ స్టేషన్ నిర్మాణానికి కావాల్సిన స్థలాన్ని ఎస్‌పి ప్రతాప్ శివ కిషోర్ శనివారం పరిశీలించారు. మండవల్లి ప్రధాన సెంటర్ వద్ద చెరువు పక్కన పోలీస్‌స్టేషన్ ఉండేది. జాతీయ రహదారి 165 పామర్రు దిగమర్రు అభివృద్ధిలో భాగంగా పోలీస్ స్టేషన్‌ను తొలగించాల్సి వచ్చింది. ప్రస్తుతం పోలీస్‌స్టేషన్ ను మండవల్లి పంచాయతీ కార్యాలయంలో నిర్వహిస్తున్నారు. గతంలోనే రెవెన్యూ కార్యాలయం వద్ద పోలీస్ స్టేషన్ నిర్మించుకునేందుకు స్థలాన్ని కేటాయించారు. ఆ స్థలం పోలీస్ స్టేషన్ నిర్మించుకునేందుకు అనుకూలంగా ఉంటుందా లేదా అనేదానిపై ఎస్‌పి పూర్తిస్థాయిలో పరిశీలించారు.

గణతంత్ర దినోత్సవ వేడుకలకు సర్వం సిద్ధం

ప్రజాశక్తి - ఏలూరు స్పోర్ట్స్

76వ గణతంత్ర దినోత్సవ వేడుకలకు సర్వం సిద్ధం చేశామని ఎస్‌పి ప్రతాప్‌శివకిషోర్ స్పష్టం చేశారు. నగరంలోని జిల్లా పోలీస్ మైదానంలో 76వ గణతంత్ర వేడుక ఉత్సవాల ఏర్పాట్లను ఎస్‌పి శనివారం పర్యవేక్షించారు. పతాకావిష్కరణ, గౌరవ వందనానికి సంబంధించిన పెరేడ్ డ్రిల్‌ను ముందుగా రిహార్సల్ ఏర్పాటు చేశారు. ఎన్‌సిసి హోంగార్డ్, సివిల్ పోలీసులు చేసే కవాతును పరిశీలించారు. ఈ సందర్భంగా ఎస్‌పి మాట్లాడుతూ 76వ గణతంత్ర దినోత్సవ వేడుకలకు సంబంధించిన ఏర్పాట్లను పూర్తి చేశామని చెప్పారు.

కురెళ్లగూడెన్ని ఆదర్శ పంచాయతీగా తీర్చిదిద్దుతా

మండల ప్రత్యేకాధికారి ఆర్‌వి.నాగరాణి

ప్రజాశక్తి - భీమడోలు

కురెళ్లగూడెన్ని ఆదర్శ పంచాయతీగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తానని భీమడోలు మండల ప్రత్యేక అధికారి, బిసి వెల్ఫేర్, ఎంపవర్‌మెంట్ జిల్లా అధికారి ఆర్‌వి.నాగరాణి హామీ ఇచ్చారు. కలెక్టర్ ఆదేశాల మేరకు కురెళ్లగూడెం గ్రామపంచాయతీని ఆమె దత్తత తీసుకున్నారు. ఈ సందర్భంగా శనివారం రైతు సేవా కేంద్రం వద్ద గ్రామస్తులతో మమేకమయ్యారు. వారు ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. గ్రామాభివృద్ధికి ప్రజల నుంచి అందాల్సిన సహాయ సహకారాల గురించి వివరించారు. గ్రామస్తులు తాము చిరకాలంగా ఎదుర్కొంటున్న సమస్యల గురించి ప్రత్యేక అధికారికి వివరించారు.

యుద్ధ ప్రాతిపదికన రిటైనింగ్ వాల్ నిర్మాణం చేపడతాం

జాతీయ రహదారి నుండి గ్రామాన్ని అనుసంధానం చేసేందుకు గతంలో నిర్మించిన అనుసంధాన రోడ్డు, వంతెన దానికి సపోర్ట్‌గా నిర్మించిన రిటైనింగ్ గోడ శిథిలమైన కారణంగా వాహనాల రాకపోకలకు ఇబ్బందిగా ఉందని గ్రామస్తులు, మానవత మండల శాఖ అధ్యక్షులు సీతారామాంజనేయులు ప్రత్యేకాధికారి దృష్టికి తీసుకొచ్చారు. దీనిపై స్పందించిన ప్రత్యేకాధికారి ఆ ప్రాంతాన్ని సందర్శించారు. అత్యవసరంగా ఆ ప్రాంతంలో శిథిలమైన రిటైనింగ్ వాల్ నిర్మాణం చేపట్టాల్సి ఉందన్నారు. ఈ మేరకు సంబంధిత శాఖల అధికారులతో మాట్లాడి సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో పలువురు గ్రామస్తులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

జాబ్‌మేళాలో 19 మందికి ఉద్యోగాలు

ప్రజాశక్తి - నూజివీడు టౌన్

నూజివీడు పట్టణంలోని ఎంవిఆర్ జూనియర్, డిగ్రీ కళాశాల ప్రాంగణంలో రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ సీడాప్ ఆధ్వర్యంలో నిర్వహించిన జాబ్ మేళాకు 52 మంది యువత హాజరవ్వగా 19 మంది ఎంపికైనట్లు కళాశాల ప్రిన్సిపల్ వి.రమేష్ తెలిపారు. ఈ జాబ్‌మేళాలో మెడ్‌ప్లస్ కోసం ఫైనాన్షియల్, సంతోష్ మారుతి, జాస్పర్ ఇండస్ట్రీస్ కంపెనీల ప్రతినిధులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో స్కిల్ డెవలప్‌మెంట్ సిబ్బంది కిషోర్, రామకృష్ణ నాయుడు పాల్గొన్నారు.

బాధిత కుటుంబాలకు ఎంఎల్‌ఎ పరామర్శ

ప్రజాశక్తి - చింతలపూడి

టిడిపి కార్యకర్తల కుటుంబాలకు ఎప్పుడూ అండగా ఉంటామని చింతలపూడి ఎంఎల్‌ఎ సొంగా రోషన్‌కుమార్ అన్నారు. మండలంలోని రేచర్ల గ్రామానికి చెందిన సోదరులు సాగిరాజు లక్ష్మీనారాయణ రాజు, పద్మనాభ రాజు తల్లి సూర్యకాంతమ్మ ఇటీవల మృతి చెందారు. బాధిత కుటుంబాన్ని ఎంఎల్‌ఎ శనివారం పరామర్శించారు. సూర్యకాంతమ్మ చిత్రపటానికి నివాళులర్పించారు. మండలంలోని మల్లాయిగూడెం సర్పంచి బీజెపి కవిత రమేష్ నాయనమ్మ అమరావతి మృతి చెందారు. మల్లాయిగూడెంలోని ఆయన స్వగృహానికి ఎంఎల్‌ఎ వెళ్లి పరామర్శించారు.

'దళితులంతా ఐక్యమవ్వాలి'

ప్రజాశక్తి - ముదినేపల్లి

రాజ్యాధికారం కోసం దళితులందరూ ఏకమై ఉద్యమానికి సిద్ధమవ్వాలని కారకవాడ మాజీ సర్పంచి, దళిత నేత బేతపూడి వెంకటరమణ చెప్పారు. శనివారం ఆయన స్థానిక విలేకర్లతో మాట్లాడారు. సమాజంలో 50 శాతం ఉన్న దళితులందరూ ఏకమై రాజ్యాధికారం కోసం పాటుపడాలని, అప్పుడే అంబేద్కర్ కాంక్షించిన సమసమాజ నిర్మాణం సాధ్యమవుతుందన్నారు. దళితులందరికీ రాజ్యాధికారం కావాలంటే అందరూ ఐక్యంగా ఉండాలన్నారు. దళితులకు రాజ్యాధికారం దక్కడం లేదన్నారు. దళితుల్లో ఐక్యత లేకపోవడంతో రాజ్యాధికారం అందుకోలేకపోతున్నారన్నారు. పార్టీలకతీతంగా దళితులందరూ ఐక్యమై రాజ్యాధికారం కోసం ఉద్యమించాల్సి ఉందన్నారు. 2029 ఎన్నికల్లో దళితులందరూ రాజ్యాధికారం కైవసం చేసుకునేందుకు ముందుకు సాగాల్సి ఉందన్నారు. పార్టీలకు అతీతంగా దళితులు అండగా ఉంటూ ఇతరులు దళితులపై దాడి చేస్తే ఏకంగా వారిని ఎదుర్కోవాలన్నారు.

జనన, మరణాల నమోదుపై అవగాహన

పోలవరం :జనన మరణాల నమోదుపై మండల కార్యాలయంలో మండల ప్రజాపరిషత్ అధికారి ఇ.శ్రీనివాస్ ఆధ్వర్యంలో శనివారం అవగాహనా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మండల ప్రజా పరిషత్ అధికారి మాట్లాడుతూ జనన మరణాలు సంభవించిన 21 రోజుల్లోపు రిజిస్ట్రేషన్ చేసుకోవాలని, జనన మరణాలు ఎక్కడ జరిగితే అక్కడే సమీప మున్సిపాలిటీ, కార్పొరేషన్, పంచాయతీల్లో లేదా ప్రసవం, మరణం జరిగిన ప్రభుత్వ వైద్యశాలల్లో నమోదు చేసుకోవడం ద్వారా అక్కడి నుంచి తమకు సమాచారం వస్తుందని, తద్వారా నమోదు ప్రక్రియ జరుగుతుందని తెలిపారు.

నేరాలు - ఘోరాలు

బ్రాందీ షాపులో చోరీ

రూ.లక్ష విలువైన మద్యం సీసాలు అపహరణ

ప్రజాశక్తి - ద్వారకాతిరుమల

ద్వారకాతిరుమల గ్రామంలోని స్థానిక వెంకటకృష్ణాపురం రోడ్డులో శ్రీ శ్రీనివాస బ్రాందీ షాపులో శుక్రవారం అర్ధరాత్రి చోరీ జరిగింది. భీమడోలు సిఐ విల్సన్, ద్వారకాతిరుమల ఎస్‌ఐ సుధీర్ సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. ఎస్‌ఐ సుధీర్ తెలిపిన వివరాల ప్రకారం.. షాపు సిబ్బంది శనివారం బ్రాందీ షాపు తెరవగా పైభాగాన రేకులు తీసివేసినట్లు గమనించారు. గుర్తు తెలియని దుండగులు షాపులోకి చొరబడి రూ.లక్ష విలువైన మద్యం బాటిల్స్ దొంగలించినట్లు గుర్తించారు. దీంతో స్థానిక పోలీసుస్టేషన్‌కు సమాచారం అందించారు. భీమడోలు సిఐ విల్సన్, ద్వారకాతిరుమల ఎస్‌ఐ సుధీర్, సంఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. క్లూస్ టీం వారిచే పర్యవేక్షించి నిందితులను త్వరలోనే పట్టుకుంటామని తెలిపారు.

రైలు నుంచి జారిపడి వ్యక్తి మృతి

ప్రజాశక్తి - ఏలూరు స్పోర్ట్స్

ప్రమాదవశాత్తు రైలు నుంచి జారిపడి వ్యక్తి మృతి చెందిన ఘటన దెందులూరు రైల్వే స్టేషన్ సమీపంలో చోటు చేసుకుంది. రైల్వే పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... దెందులూరు రైల్వే స్టేషన్ సమీపంలో ఓ వ్యక్తి రైలు నుంచి జారిపడి మృతి చెంది పడి ఉన్నాడు. సమాచారం అందుకున్న రైల్వే పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని మృతుని వద్ద ఆధారాలు సేకరించారు. అతను అస్సాం రాష్ట్రానికి చెందిన దీపంకర్ సోనోవాల్ (36)గా గుర్తించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఏలూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

400 లీటర్ల బెల్లపు ఊట ధ్వంసం

ప్రజాశక్తి - నూజివీడు టౌన్

మండలంలోని రేగుంట గ్రామంలో శనివారం దాడి చేసినట్లు నూజివీడు ప్రొహిబిషన్, ఎక్సైజ్ సిఐ ఎ.మస్తానయ్య తెలిపారు. ఈ దాడిలో పది లీటర్ల నాటు సారాను స్వాధీనం చేసుకుని, నాటు సారా తయారీకి సిద్ధంగా ఉంచిన 400 లీటర్ల బెల్లపు ఊటను ధ్వంసం చేసినట్లు చెప్పారు. పరారీలో ఉన్న కొమవరపు సుబ్బారావుపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు. ఈ దాడుల్లో నూజివీడు ప్రొహిబిషన్, ఎక్సైజ్ సబ్ ఇన్‌స్పెక్టర్ వై.ఈశ్వరరావు, ఎం.ప్రసాద్, సిబ్బంది పాల్గొన్నారు.

ట్రాక్టర్ డ్రైవర్‌పై కేసు

టి.నరసాపురం : ట్రాక్టర్ అతి వేగంగా నడిపి వ్యక్తి మృతికి కారణమైన ట్రాక్టర్ డ్రైవర్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ ఎం.జయబాబు తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం... మర్రిగూడెం పంచాయతీలోని సున్నపురాళ్లపల్లి గ్రామానికి చెందిన బొర్రా ప్రకాష్ (32) ఈ నెల 24వ తేదీన ట్రాక్టర్ పనికి వెళ్లి డ్రైవర్ ప్రక్కన కూర్చున్నాడు. డ్రైవర్ ట్రాక్టర్‌ను అతి వేగంగా నడపడంతో సున్నపురాళ్లపల్లి ప్రాథమిక పాఠశాల సమీపంలో ట్రాక్టర్‌పై నుంచి ప్రకాష్ కింద పడడంతో ట్రాక్టర్ అతనిపై నుంచి వెళ్లడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుని తండ్రి ఫిర్యాదుతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

ఏలూరును స్వచ్ఛ నగరంగా తీర్చిదిద్దేందుకు సహకరిస్తా

స్వచ్ఛ ఆంధ్ర కార్పొరేషన్ ఛైర్మన్ కొమ్మారెడ్డి పట్టాభిరామ్



మాట్లాడుతున్న స్వచ్ఛ ఆంధ్ర కార్పొరేషన్ ఛైర్మన్ పట్టాభిరామ్

ప్రజాశక్తి - ఏలూరు సిటీ

ఏలూరు నగరాన్ని స్వచ్ఛ ఏలూరుగా తీర్చిదిద్దేందుకు తన వంతు పూర్తి సహకారం అందిస్తానని స్వచ్ఛ ఆంధ్ర కార్పొరేషన్ ఛైర్మన్ కొమ్మారెడ్డి పట్టాభిరామ్ అన్నారు. స్థానిక కార్పొరేషన్ కార్యాలయంలో శనివారం మేయర్ ఛాంబర్లో జరిగిన స్వచ్ఛ ఆంధ్ర కార్పొరేషన్ సమీక్షా సమావేశానికి ఆయన ముఖ్యఅతిథిగా విచ్చేశారు. పట్టాభిరామ్ మాట్లాడుతూ గత ప్రభుత్వ నిర్లక్ష్యం కారణంగా ఏలూరు మున్సిపల్ కార్పొరేషన్ డంపింగ్ యార్డ్‌లో 60,282 మెట్రిక్ టన్నుల చెత్త నిల్వ ఉండిపోయిందన్నారు. ఇటీవల 15 వేల మెట్రిక్ టన్నుల చెత్తను క్లియర్ చేశారని, ఇంకా 40 వేల మెట్రిక్ టన్నుల చెత్త నిల్వ ఉందని, దీన్ని అక్టోబర్ రెండో తేదీలోపు క్లియర్ చేస్తామని తెలిపారు. పోణంగిలోని 30 ఎకరాల డంపింగ్ యార్డులోని చెత్త ఎప్పటికప్పుడే ప్రొసెసింగ్ ద్వారా క్లియర్ చేసి ఆ స్థలాన్ని వేరేగా ఉపయోగించుకునేలా ఎంఎల్‌ఎ బడేటి రాధాకృష్ణయ్య ద్వారా చర్యలు తీసుకుంటామన్నారు. నగరంలో వచ్చే చెత్తను ఎరువుగా తయారుచేసి రైతులకు అందించే విధంగా చర్యలు తీసుకుంటామన్నారు. స్థానిక తంగెళ్లమూడి ప్రాంతంలో నిర్మించిన 5 ఎంఎల్‌డి ట్రీట్‌మెంట్ ప్లాంట్‌ను త్వరలో వినియోగంలోకి తీసుకొస్తామన్నారు. ఎంఎల్‌ఎ బడేటి రాధాకృష్ణయ్య (చంటి) మాట్లాడుతూ స్వచ్ఛ ఏలూరు నిర్మించడానికి కృషి చేస్తున్నామన్నారు. మేయర్ షేక్ నూర్జహాన్ పెదబాబు మాట్లాడుతూ ప్రతి నెలా మూడో శనివారం ప్రజాప్రతినిధులు, అధికారులు సిబ్బంది కలిసి నగరంలో చెత్త ఎక్కువగా ఉన్న ప్రాంతాలను గుర్తించి పారిశుధ్య పనులను నిర్వహిస్తున్నామన్నారు. స్వీపింగ్ మిషన్, కంపెక్టర్స్ అవసరమని పట్టాభిరామ్ దృష్టికి తీసుకెళ్లారు. కమిషనర్ ఎ.భానుప్రతాప్ మాట్లాడుతూ నగరంలోని జనాభా ఆధారంగా ప్రతిరోజూ ఎంత చెత్త తయారవుతుంది, ఎన్ని వాహనాలతో తరలిస్తున్నాం, ఎంతమంది సిబ్బంది ఉన్నారు, ఇంకా ఎంతమంది సిబ్బంది అవసరం, ఎన్ని పరికరాలు అవసరం అనేది వివరించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ అధికారులు, కార్పొరేటర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

ఆర్‌జియుకెటిలో మెగా ప్లాంటేషన్

ప్రజాశక్తి - నూజివీడు టౌన్

నూజివీడు ఆర్‌జియుకెటిలో పవర్ గ్రిడ్, నున్న సీనియర్ జనరల్ మేనేజర్ కె.నాగమల్లేశ్వరరావు సహకారంతో మెగా ప్లాంటేషన్ కార్యక్రమం నిర్వహించినట్లు డైరెక్టర్ ఆచార్య ఎస్.అమరేంద్రకుమార్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తల్లి పేరుతో ఒక మొక్క అయినా నాటుదాం అనే నినాదంతో పవర్ గ్రిడ్ సీనియర్ జనరల్ మేనేజర్, కె.నాగమల్లేశ్వరరావు ఆర్‌జియుకెటి ప్రాంగణంలో నాటడానికి 200 మొక్కలను వితరణ చేశారని తెలిపారు.

మొక్కలతోనే పర్యావరణ పరిరక్షణ

ముసునూరు :పర్యావరణ పరిరక్షణకు ప్రతిఒక్కరూ ఒక మొక్కను నాటాలని పవర్ గ్రేడ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా నున్న జనరల్ మేనేజర్ కె.శ్రీనివాసరావు తెలిపారు. పవర్ గ్రేడ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా నున్న వారి ఆధ్వర్యంలో మండలంలోని రమణక్కపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శనివారం 75 మొక్కలు ఉచితంగా అందించారు. 75వ గణతంత్ర దినోత్సవ వేడుకలు పురస్కరించుకుని శ్రీ గంధం, ఉసిరి, మామిడి, దానిమ్మ, నిమ్మ, పూల మొక్కలు ఇలా 75 మొక్కలు అందించారు.

ఊర చెరువు పరిశీలన

ప్రజాశక్తి - జీలుగుమిల్లి

జీలుగుమిల్లిలో గత ఆరేళ్ల క్రితం తవ్విన ఊర చెరువును ప్రపంచ బ్యాంక్ బృందం శనివారం పరిశీలించింది. 2019లో ఊర చెరువు నిర్మాణానికి రూ.1.24 కోట్ల నిధులు కేటాయించారు. అప్పట్లో కొంత పని పూర్తవ్వకపోవడంతో రూ.30 లక్షల నిధులు ఆగినట్లు తెలిపారు. పని పూర్తి చేసిన అనంతరం సంబంధిత కాంట్రాక్టర్ ప్రపంచ బ్యాంక్ దృష్టికి తీసుకెళ్లగా శనివారం బ్యాంక్ బృందం ఊర చెరువును పరిశీలించింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ త్వరలోనే చెరువు నిర్మాణానికి సంబంధించి నిధులు విడుదల చేయనున్నట్లు తెలిపారు. చెరువు ద్వారా రైతాంగానికి సాగు నీరు ఇబ్బంది లేకుండా చూడాలని చెప్పారు.

పాఠశాలకు 40 బెంచీలు

ప్రజాశక్తి - బుట్టాయగూడెం

స్థానిక కరాటం కృష్ణమూర్తి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదో తరగతి విద్యార్థులు కింద కూర్చోవడాన్ని గమనించిన ఇండియాన్ ట్యూబకో కంపెనీ సిబ్బంది ఐటిసి సౌజన్యంతో 40 బెంచీలను పాఠశాలకు అందించింది. ఈ సందర్భంగా పాఠశాల ఇన్‌ఛార్జి ప్రధానోపాధ్యాయులు పి.శ్రీనివాసరావు కృతజ్ఞతలు తెలిపారు.

మృతుని కుటుంబానికి ఆర్థిక సాయం

ప్రజాశక్తి - ముదినేపల్లి

మండలంలోని విశ్వనాద్రిపాలెం గ్రామానికి చెందిన టిడిపి కార్యకర్త కాగిత సుధాకరరావు శనివారం మృతి చెందారు. ఈ విషయం తెలుసుకున్న టిడిపి నియోజకవర్గ కో-కన్వీనర్ కొడాలి వినోద్ సుధాకరరావు మృతదేహాన్ని సందర్శించి పూలమాల వేసి అంజలి ఘటించారు. అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించి మట్టి ఖర్చుల నిమిత్తం బొర్రా బాలసాయి ఛారిటబుల్ ట్రస్ట్ ద్వారా రూ.పది ఆర్థిక సాయం అందించారు. వినోద్‌తో పాటు పార్టీ గ్రామ ప్రెసిడెంట్ యార్లగడ్డ గంగయ్య, పరసా ఏడుకొండలు, వీరంకి చక్రపాణి, ఉన్నారు.

27 నుంచి ఆధార్ మొబైల్ క్యాంపులు

ప్రజాశక్తి - భీమడోలు

మండలంలోని వివిధ గ్రామాల్లో ఉన్న అంగన్‌వాడీ కేంద్రాల వేదికగా ఈ నెల 27వ తేదీ నుంచి 30వ తేదీ వరకు ఆధార్ మొబైల్ క్యాంపులు నిర్వహించనున్నట్లు ఎంపిడిఒ పద్మావతి దేవి తెలిపారు. భీమడోలు ఆధార్ కిట్ పర్యవేక్షణలో ఈ నెల 27, 28వ తేదీల్లో భీమడోలు, 29, 30వ తేదీల్లో పొలసానిపల్లి గ్రామాల్లో, పూళ్ల ఆధార్ కిట్ పర్యవేక్షణలో 27, 28వ తేదీల్లో అంబరుపేట, 29 ,30వ తేదీల్లో దుద్దేపూడి గ్రామాల్లో, గుండుగొలను ఆధార్ కిట్ పర్యవేక్షణలో ఈ నెల 27, 28వ తేదీల్లో గుండుగొలను, 29, 30వ తేదీల్లో కోరుకొల్లు గ్రామాల్లో క్యాంపు నిర్వహణ ఉంటుందన్నారు.

ఘనంగా శశి హైస్కూల్ 12వ వార్షికోత్సవం

ప్రజాశక్తి - కలిదిండి



సాంస్కృతిక కార్యక్రమాల్లో విద్యార్థులు

స్థానిక శశి హైస్కూల్ 12వ వార్షికోత్సవం శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వహించిన పలు సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. వివిధ ఆటల పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందించారు. విద్యార్థులు ఆట పాటలతో పాటు చదువులోనూ రాణిస్తూ అత్యుత్తమ ఫలితాలు సాధించాలని కరెస్పాండెంట్ జివి.సత్యనారాయణరాజు అన్నారు.

పది పరీక్షల్లో నూరు శాతం ఫలితాలు సాధించాలి

ప్రజాశక్తి - ముదినేపల్లి

వసతి గృహం విద్యార్థులు పదో తరగతి పరీక్షల్లో నూరు శాతం ఫలితాలు సాధించాలని జిల్లా బిసి సంక్షేమ అధికారిణి ఆర్‌వి.నాగరాణి అన్నారు. ముదినేపల్లిలోని బిసి బాలుర వసతి గృహాన్ని ఆమె శనివారం ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా విద్యార్థులను పలు ప్రశ్నలు అడిగి వారి నుంచి సమాధానాలను రాబట్టారు. అనంతరం వసతి గృహం పై అంతస్తులో నూతనంగా రూ.54 వేలతో ఆధునీకరించి నిర్మించిన ఎస్‌ఆర్.శంకరన్ రిసోర్స్ సెంటర్‌ను ఆమె ప్రారంభించారు.

దోమల వల్ల వచ్చే వ్యాధులపై అవగాహన అవసరం

ప్రజాశక్తి - భీమడోలు

దోమల వల్ల కలిగే సంక్రమిత వ్యాధుల పట్ల అవగాహన కలిగి ఉండాలని, అవసరం మేరకు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల సేవలను తీసుకోవాలని పూళ్ల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యులు కళ్యాణి మహేశ్వరి, మలేరియా జిల్లా సహాయ అధికారి జె.గోవిందరావు కోరారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని వడ్లపట్ల ఆవాస ప్రాంతంలో శనివారం దోమల వల్ల కలిగే ఇబ్బందులపై అవగాహనా కార్యక్రమాన్ని నిర్వహించారు. దోమల నియంత్రణకు వినియోగించే ఎబెట్ ద్రావణాన్ని మురుగు కాలువల్లో పిచికారీ చేయించారు. ప్రజలకు అవగాహన కల్పించేందుకు కరపత్రాల పంపిణీ కార్యక్రమాన్ని చేపట్టారు.

కార్పొరేట్ కాలేజీల్లో నిలువు దోపిడీ

యూత్ కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గోళ్ల పవన్‌కుమార్

ప్రజాశక్తి - నూజివీడు టౌన్

రాష్ట్రంలో ఇంటర్మీడియట్ విద్యార్థులను కార్పొరేట్ కాలేజీలు నిత్యం వేధిస్తున్నాయని యూత్ కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గోళ్ల పవన్‌కుమార్ విమర్శించారు. నూజివీడులో ఆయన శనివారం మాట్లాడుతూ ఇంటర్ పరీక్షలు దగ్గర పడుతున్న తరుణంలో విద్యార్థులను వారి చదువులకు ఇబ్బంది కలిగించే విధంగా ప్రయివేట్, కార్పొరేట్ విద్యాసంస్థలు ఫీజులను వసూలు చేసుకోవచ్చనే దుర్మార్గపు ఆలోచన ఉంటున్నాయన్నారు. ఫీజులు చెల్లిస్తేనే ప్రాక్టికల్స్‌కు, పబ్లిక్ పరీక్షలకు అనుమతిస్తామని, బకాయి ఫీజులు కట్టకపోతే కళాశాలకు రానివ్వబోమని, అటెండెన్స్ వేయకుండా అడ్డుకుంటామని, విద్యార్థులను వారి తల్లిదండ్రులను విద్యాసంస్థల నిర్వాహకులు వేధిస్తున్నారని చెప్పారు.

'పేదల సాగు భూములను జెసి పరిశీలించాలి'

ముసునూరు :సాగు దారులకు పట్టాలు మంజూరు చేయాలని సిపిఐ (ఎంఎల్) లిబరేషన్ మండల కార్యదర్శి వేముల బక్కయ్య డిమాండ్ చేశారు. సిపిఐ (ఎంఎల్) లిబరేషన్ అఖిలభారత వ్యవసాయ గ్రామీణ కార్మిక సంఘం ఆధ్వర్యంలో రమణక్కపేట గ్రామంలో కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వేముల బక్కయ్య మాట్లాడుతూ రమణక్కపేట గ్రామంలో మూడు తరాలు గా పేదలు సాగు చేస్తున్న భూములకు అటవీ భూములని అభ్యంతరం పెడుతూ సాగు భూములకు హక్కుల కల్పించకుండా, పట్టాలు మంజూరు చేయకుండా తీవ్ర ఇబ్బందులకు గురి చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. పేదల సాగు భూములకు పట్టాలు లేకపోవడం వల్ల ప్రకృతి వైపరీత్యాలు సంభవించినప్పుడు రైతు భరోసా, ఇన్‌పుట్ రాయితీ అమలు కావడం లేదన్నారు.

ఘనంగా జాతీయ ఓటర్ల దినోత్సవం

ప్రజాశక్తి - నూజివీడు టౌన్

జాతీయ ఓటర్ల దినోత్సవం సందర్భంగా సబ్ కలెక్టర్ కార్యాలయం నుంచి పీజీ సెంటర్ వరకు కొనసాగిన ర్యాలీని నూజివీడు సబ్ కలెక్టర్ స్మరణ్‌రాజ్ జెండా ఊపి ప్రారంభించారు. అనంతరం పీజీ సెంటర్ ప్రాంగణంలో విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 18 ఏళ్ల వయసు నిండిన ప్రతి ఒక్కరూ ఓటు నమోదు చేయించుకోవాలన్నారు.

చింతలపూడి : చింతలపూడి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఎన్‌సిసి క్యాడెట్ల ఆధ్వర్యంలో కార్యక్రమం నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ పి.శ్రీనివాసరావు విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. ఎన్‌సిసి విద్యార్థులకు వక్తృత్వ పోటీలు నిర్వహించి గెలుపొందిన వారికి ప్రశంసాపత్రాలను అందించారు. అవగాహనా ర్యాలీ నిర్వహించారు. చింతలపూడి ఫైర్ స్టేషన్ సెంటర్‌లో చింతలపూడి తహశీల్దార్ ప్రమాద్వర అవగాహనా సదస్సు ఏర్పాటు చేశారు.

జీలుగుమిల్లి : జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఇన్‌ఛార్జి తహశీల్దార్ ఉదయ్‌భాస్కర్ ఆధ్వర్యంలో విద్యార్థులకు ముగ్గుల పోటీలు నిర్వహించి బహుమతులు అందించారు. ఈ సందర్భంగా ఓటు హక్కుపై అవగాహన కల్పించారు. అనంతరం ఓటు హక్కు వినియోగంపై ప్రతిజ్ఞ చేయించి ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఒ కె.వెంకటలక్ష్మి, ఎంఇఒ కె.శ్రీనివాస్, హెచ్‌ఎం చంద్రావతి, సీనియర్ అసిస్టెంట్ రమణ, విఆర్‌ఒలు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

నూజివీడు టౌన్ : మండల పరిధిలోని గొల్లపల్లి గ్రామంలో ఉన్న శ్రీ అన్నే రామకృష్ణయ్య జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జాతీయ ఓటర్ల దినోత్సవం ఘనంగా నిర్వహించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు రాధికారాణి మాట్లాడుతూ 18 ఏళ్లు నిండిన ప్రతి వ్యక్తికి ఓటు ఉంటుందని తెలిపారు. అనంతరం స్కూల్ మొదటి విద్యార్థి అయిన జి.దైవదాస్‌ను ఘనంగా సన్మానించారు.

ముసునూరు : అతిపెద్ద ప్రజాస్వామ్య భారతదేశంలో మనకు లభించిన శక్తివంతమైన ఆయుధం ఓటు హక్కు అని తహశీల్దార్ కె.రాజకుమార్, ఎంపిడిఒ జి.రాణి అన్నారు. మండలంలోని 16 గ్రామ సచివాలయాల్లో ఓటర్ దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఇఒపిఆర్‌డి బసవరాజు, అచ్యుత సత్యనారాయణ మాట్లాడారు.

భీమడోలు : అర్హత గల ప్రతిఒక్కరూ ఓటరుగా నమోదు కావాలని పొలసానిపల్లి గ్రామ సర్పంచి షేక్ రహీమా బేగం హసేన కోరారు. గ్రామంలో శనివారం రెండు వేర్వేరు కార్యక్రమాలను గ్రామపంచాయతీ ఆధ్వర్యంలో నిర్వహించారు. దీనిలో భాగంగా జాతీయ ఓటర్ దినోత్సవం కార్యక్రమంతో పాటు, ఆంజనేయ నగరం ఆవాస ప్రాంతంలో పశు ఆరోగ్య శిబిరాన్ని చేపట్టారు. జాతీయ ఓటర్ల దినోత్సవంలో భాగంగా గ్రామ సర్పంచితో పాటు, గ్రామపంచాయతీ కార్యదర్శి జయరామకృష్ణ, గ్రామ రెవెన్యూ అధికారి సాల్మన్‌రాజు ఇతర ప్రముఖుల భాగస్వామ్యంతో పురవీధుల్లో ర్యాలీ నిర్వహించారు. గ్రామం సెంటర్‌లో మానవహారంగా ఏర్పడ్డారు. నూతన ఓటర్లకు మంజూరైన ఓటర్ కార్డుల పంపిణీ కార్యక్రమం చేపట్టారు. సీనియర్ ఓటర్లను సత్కరించారు. ఆంజనేయ నగరంలో నిర్వహించిన పశు ఆరోగ్య శిబిరంలో పశువులకు అందుతున్న సేవలను పరిశీలించారు.

చాట్రాయి :తహశీల్దార్ డి.ప్రశాంతి ఆధ్వర్యంలో చాట్రాయి సెంటర్‌లో కార్యక్రమం నిర్వహించారు. తహశీల్దార్ కార్యాలయ ఉద్యోగులు, గ్రామ సచివాలయాల సిబ్బంది, విద్యార్థులు సెంటర్‌లో మానవహారంగా ఏర్పడి ప్రతిజ్ఞ చేశారు. అనంతరం చాట్రాయి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నలుగురు సీనియర్ ఓటర్లను సన్మానించారు. ప్రజాస్వామ్య దేశంలో ఓటు హక్కు ప్రాముఖ్యతను తహశీల్దార్ ప్రశాంతి వివరించారు. ఈ కార్యక్రమంలో అతిథిగా జిల్లా తెలుగు రైతు ప్రధాన కార్యదర్శి మోరంపూడి శ్రీనివాసరావు పాల్గొని మాట్లాడారు.

వేలేరుపాడు రూరల్ : స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన కార్యక్రమంలో తహశీల్దార్ డివివి.సత్యనారాయణ, ఇన్‌ఛార్జి ఎంపిడిఒ శ్రీహరి, డిప్యూటీ డిఇఒ జి.రామ్‌మోహన్‌రావు ఓటు హక్కుపై ఓటర్లకు అవగాహన కల్పిస్తూ ర్యాలీ నిర్వహించి ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం సమావేశం ఏర్పాటు చేసి ఓటు హక్కు ప్రాముఖ్యత గురించి వివరించి సీనియర్ ఓటర్లను సన్మానించారు. మండలంలోని 22 పోలింగ్ స్టేషన్లో జాతీయ ఓటర్ దినోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించారు. స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో వ్యాసరచన, ముగ్గుల పోటీలు నిర్వహించి గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందించారు.

మండవల్లి : స్థానిక ఎంపిపి-1 స్కూల్లో నిర్వహించిన కార్యక్రమంలో ఎంపిడిఒ రామలింగేశ్వరరావు ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు అనంతరం విద్యార్థినులకు ముగ్గుల పోటీలు నిర్వహించి బహుమతులు అందించారు. అనంతరం సీనియర్ సిటిజన్లను దుశ్సాలువాలు, పూలమాలలతో ఘనంగా సన్మానించారు.

ముదినేపల్లి : పెదపాలపర్రు హైస్కూల్లో విద్యార్థినులకు ఆటలు, ముగ్గుల పోటీలు నిర్వహించారు. విజేతలకు తహశీల్దార్ సుభాని, గ్రామ సర్పంచి గంటా రాకేష్ బహుమతులను అందించారు. సీనియర్ ఓటర్లను సన్మానించారు. సర్పంచి నిమ్మగడ్డ కైకమ్మ ఆధ్వర్యంలో ముదినేపల్లిలో, వడాలిలో టిడిపి నియోజకవర్గ కన్వీనర్ వీరమల్లు నరసింహారావు, సర్పంచి దుర్గాశ్రీ సీనియర్ ఓటర్లకు శాలువాలు కప్పి పూలమాలలతో సత్కరించారు.

టి.నరసాపురం : స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల వద్ద నుంచి అంబేద్కర్ సెంటర్ వరకు ర్యాలీగా వెళ్లి మానహారం నిర్వహించి ఓటరు ప్రతిజ్ఞ చేశారు. అనంతరం స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సీనియర్ ఓటర్లను సన్మానించి, ముగ్గుల పోటీలు, వ్యాసరచన పోటీల్లో గెలుపొందిన విజేతలకు సర్టిఫికెట్లు అందించారు. ఈ సందర్భంగా తహశీల్దార్ టి.సాయిబాబా మాట్లాడారు.

ఏలూరు అర్బన్ : స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో పొలిటికల్ సైన్స్ విభాగం ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమానికి ప్రిన్సిపల్ డాక్టర్ గుత్తా గిరిబాబు అధ్యక్షత వహించి మాట్లాడారు. వక్తృత్వ, వ్యాసరచన పోటీల్లో గెలుపొందినవారికి కలెక్టర్ వెట్రిసెల్వి చేతులమీదుగా బహుమతులు అందించారు.

దెందులూరు : ఏలూరు మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాల ఇందిరా కాలనీలో నిర్వహించిన కార్యక్రమంలో సాంఘిక శాస్త్ర ఉపాధ్యాయులు జి.కృష్ణ మాట్లాడారు. సీనియర్ ఓటర్లు పావాడి రాములమ్మ, పల్లెల నాగరత్నంలను సత్కరించారు. గారపాటి హైమవతి దేవి జిల్లా పరిషత్ హై స్కూల్‌లో ముగ్గుల పోటీలు, ర్యాలీ, మానవహారం నిర్వహించారు. సీనియర్ ఓటర్లను సన్మానించి కొత్త ఓటర్లకు ఓటరు కార్డు పంపిణీ చేపట్టారు. ముఖ్య అతిథిగా దెందులూరు నియోజకవర్గ ఎన్నికల రిజిస్ట్రేషన్ అధికారి కె.భాస్కర్ హాజరయ్యారు. పోటీల్లో గెలుపొందినవారికి తహశీల్దార్ సుమతి బహుమతులు అందించారు.

పోలవరం : మండలంలో డిప్యూటీ తహశీల్దార్ శ్రీనివాసరావు ఆధ్వర్యంలో నిర్వహించారు. పోలవరం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో పోలవరం సర్పంచి పొడం పుష్ప, ఎంపిపి సుంకర వెంకటరెడ్డి ముఖ్య అతిథులుగా హాజరై విద్యార్థులకు ఓటు హక్కు ప్రాముఖ్యతపై అవగాహన కల్పించారు. అనంతరం స్థానిక ఏటిగట్టు సెంటర్‌లో విఆర్‌ఒలు, బిఎల్‌ఒలతో కలిసి మానవహారంగా ఏర్పడి ర్యాలీ నిర్వహించి ప్రతిజ్ఞ చేశారు. 2కె రన్‌లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందించారు.

బుట్టాయగూడెం : కరాటం కృష్ణమూర్తి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు, ఉపాధ్యాయులు పాఠశాల ఇన్‌ఛార్జి ప్రధానోపాధ్యాయులు పెద్దింటి శ్రీనివాసరావు అధ్యక్షతన ర్యాలీ నిర్వహించారు.

కుక్క కాటుకు గురైన వ్యక్తి మృతి

ప్రజాశక్తి - ముసునూరు

పిచ్చికుక్క కాటుకు గురై ఆసుపత్రిలో చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి వ్యక్తి మృతి చెందాడు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం... మండల కేంద్రమైన ముసునూరు గ్రామానికి చెందిన అబ్బదాసరి జోసఫ్ (52) కూలి పనులకు వెళ్తూ ఉంటాడు. ఈ క్రమంలో వారం రోజుల క్రితం కూలి పనులకు నడుకుకుంటూ వెళ్తుండగా దారిలో కుక్క దాడి చేసింది. ఈ దాడిలో కుక్క కాటుకు గురైన జోసఫ్‌ను బంధువులు విజయవాడ ఏరియా ఆసుపత్రికి తరలించారు. అప్పటి నుంచి అక్కడ చికిత్స పొందుతున్న జోసఫ్ పరిస్థితి విషమించి శనివారం ఉదయం మృతి చెందాడు. విషయం తెలుసుకున్న టిడిపి క్లస్టర్ ఇన్‌ఛార్జి గార్లపాటి నరసింహారావు బాధిత కుటుంబాన్ని పరామర్శించి రూ.ఐదు వేల ఆర్థిక సాయం అందించారు. ముసునూరులో వీధి కుక్క జోసఫ్‌తో పాటు అదేరోజు మరో ఎనిమిది మందిపై దాడి చేసింది. ఈ దాడిలో కుక్క కాటుకు వారందరూ మొత్తం తొమ్మిది ఆసుపత్రిలో చికిత్స పొంది చికిత్స పొందారు. ఎనిమిది మంది డిశ్చార్జి అయ్యారు. ప్రస్తుతం వారి పరిస్థితి నిలకడగానే ఉందని వైద్యులు తెలిపారు. జోసఫ్ పరిస్థితి విషమించి మృతి చెందాడు.